తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026




## కామధేను వాహనంపై...
# అలరించిన గణనాధుడు

కాణిపాకం, అక్టోబర్ 2 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాధుడు కామధేనువాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామపురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం నాయి బ్రాహ్మణ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు పగలు వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు సా ్వమివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అలంకరించి ప్రత్యేకపూజలతో ధూపధీపనైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కామధేను వాహనంపై అధిరోహించి భక్తులకు అభయ హస్తమిచ్చారు. ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ పెంచల కిషోర్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరెండెంట్‌లు శ్రీధర్ బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, రవి, మాజీ సర్పంచ్ శాంతిసాగం రెడ్డిలతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయ దారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## నేర చరితులకు...
# ఎన్నికల్లో నో ఛాన్స్!

**-అభ్యర్థుల ఎంపికలో క్లీన్ ఇమేజ్‌కు ప్రాధాన్యం!**



**ప్రభాతవార్త-తిరుపతి:**
ఆధ్యాత్మిక నగరం తిరుపతి జిల్లా కేంద్రంగా మారిన తరువాత తొలిసారిగా జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో అధికార కూటమి ఆచితూచి వ్యవహరించనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మేయర్ అభ్యర్థి , కార్పొరేటర్ల ఎంపికలో నేరచరిత్ర లేని, క్లీన్ ఇమేజ్ ఉన్న వ్యక్తులకే ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచారం.
అధికార వర్గాలపై విశ్వసనీయత దెబ్బతినకుండా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొందరు నాయకులు మున్సిపల్ ఎన్నికల అంశాన్ని ఇప్పటికే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కష్టపడిన వారికి ప్రాధాన్యత తగ్గి పోతుందని కొందరు బాధ వ్యక్తం చేశారు. చంద్రబాబు తిరుపతి ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలిసింది. తిరుపతి దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న నగరం కావడంతో ఇక్కడ జరిగే చిన్న రాజకీయ పరిణామం కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపడే అవకాశం ఉందన్న అభిప్రాయం కూటమి వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భూ వివాదాలు, తీవ్రమైన నేర కేసులు, వివాదాస్పద నేపథ్యం వంటి అంశాలు ఉన్న వ్యక్తులకు కీలక పదవులు అప్పగిస్తే ప్రతిపక్షాలకు రాజకీయ విమర్శలకు అవకాశం కల్పించినట్లవుతుందన్న చర్చ జరుగుతోంది. గత మున్సిపల్ ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి అభ్యర్థుల ఎంపికలో మరింత జాగ్రత్త అవసరమని కూటమి నేతలు భావిస్తున్నారు. ఒకవేళ కూటమి తరఫున నేరచరిత్ర ఉన్న వ్యక్తికి మేయర్ ,కార్పొరేటర్ టికెట్ లభిస్తే,వైసిపి ప్రధాన రాజకీయ అంశంగా మార్చుకునే అవకాశం ఉందని కూటమి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రత్యేకించి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి సుపరిపాలన, చట్టపాలన, నేరరహిత రాజకీయాల గురించి చేస్తున్న ప్రచారానికి అభ్యర్థుల నేపథ్యం కీలకంగా మారవచ్చని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

**మేయర్ పదవి కీలకం:**
తిరుపతిలో మేయర్ పదవికి ఎంపికయ్యే వ్యక్తి వ్యక్తిగత ప్రతిష్ఠపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే, అది స్థానిక రాజకీయాలను దాటి రాష్ట్రస్థాయిలో చర్చకు దారితీసే అవకాశం ఉందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. అభ్యర్థి ఎంపికకు కేవలం గెలుపు అవకాశాలు కాకుండా అర్హతలు, విజయాలు, మెరిట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు పేర్కొంది.మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపికలో కేవలం కుల సమీకరణాలను కాకుండా వ్యక్తి, కుటుంబ నేపథ్యం, విద్యార్హతలు, సామాజిక సేవ, ప్రజల్లో ఉన్న ప్రతిష్ఠ, పార్టీ పట్ల అంకితభావం, వివాదరహిత వ్యక్తిత్వం వంటి అంశాలను కూడా పరిశీలించాలని సర్వే బృందాలకు సూచించినట్లు సమాచారం. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకుల సిఫార్సులకంటే అభ్యర్థి సామాజిక అంగీకారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. యువతకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్న ఆలోచన కూడా కూటమి నాయకత్వంలో ఉందని సమాచారం. విద్యావంతులు, యువత, సామాజిక సేవా రంగంలో చురుకుగా ఉన్నవారిని ప్రోత్సహించడం ద్వారా తిరుపతి కార్పొరేషన్‌కు కొత్త పాలన తీసుకురావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేయర్ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ పెరుగుతోంది. కులం-బలం-ఆర్థిక సామర్థ్యాల కంటే క్లీన్ ఇమేజ్, ప్రజాసేవ, వ్యక్తిగత ప్రతిష్ఠకు ఎంత ప్రాధాన్యం లభిస్తుందన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

## ఇస్రో ఆధ్వర్యంలో...
# ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 2 ప్రభాతవార్త: రాకెట్ విప్లవం అనే ఇతివృత్తంతో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకుఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇస్రో అధికారులుశుక్రవారం తెలిపారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, మానవాళి అభ్యున్నతికి అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ నిర్వహించే అంతర్జాతీయ వేడుకగా ఈ వారోత్సవాలను జరుపుతున్నారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం 1999వ సంవత్సరంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 4 నుంచి 10వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించాలని ప్రకటించింది. 1957అక్టోబర్ 4న తొలి మానవ నిర్మిత భూ ఉపగ్రహం స్పుత్నిక్ 1 ప్రయోగించబడిన సందర్భాన్ని, అలాగే 1967 అక్టోబర్10న అంతరిక్ష అన్వేషణ, శాంతియుత వినియోగానికి సంబంధించిన ఒప్పందం అమల్లోకి వచ్చిన సందర్భాన్నిగుర్తు చేసుకుంటూ ఈ తేదీలను అంతరిక్ష వారోత్సవాలుగా నిర్ణయించారు. ఆధునిక ప్రయోగ సాంకేతిక పరిజ్ఞానం అంతరిక్ష రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు, కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టే వ్యయాన్ని తగ్గించడం, విశ్వవిద్యాలయాలు, వివిధ సంస్థలు, విద్యార్థులకు అంతరిక్ష రంగాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలను ఇతివృత్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. ప్రొపల్షన్ వ్యవస్థలు, ప్రయోగ వ్యవస్థలు, ఆటో మిషన్, నూతన ఆవిష్కరణలు అంతరిక్ష రంగాన్ని మరింత అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, తమిళనాడు రాష్ట్రాలలోని వివిధ పట్టణాలలో నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 4న సూళ్లూరుపేటలో స్పేస్ వాక్‌తో ఈ కార్యక్రమం ప్రారంభమై ఐదో తేదీన శ్రీహరికోటలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల భాగస్వామ్యంతో ప్రదర్శనలు, పోటీలు, వాక్ ఫర్ స్పేస్ వీక్ కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఇస్రో శాస్త్రవేత్తలతో ఉపన్యాసాలు, ముఖాముఖి చర్చ కార్యక్రమాలు, స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శన ఈ కార్యక్రమంలో కొనసాగుతాయి. శ్రీహరికోట కేంద్రంగా నిర్వహించే ఈ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ఇస్రో అధికారులు కృషి చేస్తున్నారు.

## అప్పుల బాధ తాళలేక..
# రైతు ఆత్మహత్య!


మృతి చెందిన వెంకటరామరాజు

రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త: రైల్వే కోడూరు మండలంలోని సురభూపాలు పల్లె గ్రామపంచాయతి పరిధిలోని పొట్టి రాజు గారి పల్లె చెందిన వెంకటరామరాజు (58) వ్యవసాయ అప్పులతో ఆత్మహత్యకు పాల్పడి రూయ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాలుగా వెంకటరామరాజు వ్యవసాయం ద్వారా నష్టాలు భారీగా రావడంతో అప్పుల వారు ఒత్తిడిలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అయితే మృతునికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో ఎంతో ఉత్తమంగా ఉంటూ అందరితోను సఖ్యంగా ఉండి పనిచేసుకుంటున్న సందర్భంలో అప్పులు బాధలు తట్టుకోలేక శుక్రవారం ఉదయం విష ద్రావణం తీసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గుర్తించిన గ్రామస్తులు వెంకట్రామరాజును హుటాహుటిగా తిరుపతికి రూయ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి వెంకటరామరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు వారు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రైల్వే కోడూరు వైసిపి సీనియర్ నేత స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ రామిరెడ్డి ద్వజారెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి,ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు.

## హార్టికల్చర్ హబ్‌తో...
# ఉద్యాన రంగం సమగ్ర అభివృద్ధి

**- చిత్తూరు జిల్లాకు రూ.1,529.69 కోట్ల విలువైన ప్రతిపాదనలు - పంట ఉత్పత్తి నుండి మార్కెటింగ్ వరకు సమగ్ర విలువ ఆధారిత శ్రేణి - కలెక్టర్**

చిత్తూరు, అక్టోబర్ 1 ప్రభాతవార్త: రాయలసీమలో ఉద్యాన రంగంను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయలసీమ సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళికలో చిత్తూరు జిల్లాకు రూ.1,529.69 కోట్ల విలువైన ప్రతిపాదనలు కేటాయించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మదనపల్లిలో అక్టోబర్ 2న సిఎం నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఈ కార్యక్రమంను ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యానవన రంగం, సాగునీరు, మౌళిక వసతులు, గ్రామీణ అభివృద్ధి అంశాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుంద న్నారు. జిల్లాలో మూడేళ్ళ పాటు మూడు దశలుగా 20క్లస్టర్లు, 27 మండలాల్లో ఈ కార్యక్రమాలను అమలు చేయనున్నామన్నారు. మొదటి దశ 2026-27 సంవత్సరంలో 5 క్లస్టర్లు, 7 మండలాలు, రెండవ దశ 2027-28లో 8 క్లస్టర్లు, 9 మండలాలు, మూడవ దశ 2028-29లో 7 క్లస్టర్లు, 11 మండలాల్లో ఈ ప్రణాళిక అమలు కానున్నదన్నారు. కేవలం పంట ఉత్పత్తి వరకు మాత్రమే కాకుండా ఉత్పత్తి, నాణ్యత పెంపు, పంట అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులు వరకు పూర్తి స్థాయి విలువ ఆధారిత శ్రేణిని అభివృద్ధి చేయడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రణాళికలో రైతులకు సూక్ష్మ సాగునీటి సదుపాయాలను విస్తృతంగా అందించి నీటి వినియోగ సామర్థ్యంను పెంచడానికి రూ.620.40 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. అలాగే మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విదేశీ, ప్రత్యేక రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలు, ఆయిల్‌ఫామ్ వంటి పంటలను ప్రోత్సహించడానికి రూ.383.74 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు.అలాగే మంచి వ్యవసాయ పద్ధతులు, పట సంరక్షణ, ట్రేసబిలిటీ, ధృవీకరణ వంటి చర్యలను ప్రోత్సహించడం కోసం రూ.28.85 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే సేకరణ కేంద్రాలు, గిడ్డంగులు, సార్టింగ్ కేంద్రాలు, ప్యాక్‌హౌస్‌లు, డిజిటల్ ప్రదర్శన బోర్డులు, గ్రేడింగ్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేయడానికి రూ.77.11 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలకు రూ.17.40 కోట్లు, సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ, ఫ్రంట్‌లైన్ డెమాన్‌స్ట్రేషన్ తదితర కార్యక్రమాల అమలు కోసం రూ.16.13 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

## సమాజంను స్వచ్ఛంగా ఉంచడానికి కృషి : ఎంపీ,ఎమ్మెల్యే



చిత్తూరు, అక్టోబర్ 2 ప్రభాతవార్త: గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంను స్వచ్ఛంగా, ఆరోగ్యంగా ఉంచడానికి శ్రమిస్తున్న వారిని సత్కరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు అన్నారు. జెడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ పరిభ్రమనంలో పరిశుభ్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురిని సత్కరించి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలు కన్నా స్వచ్ఛభారత్ సాధనలో స్వచ్ఛ ఆంధ్ర సేవకుల పాత్ర గణనీయమైనదన్నారు. సమాజంను స్వచ్ఛంగా, ఆరోగ్యంగా ఉంచడంలో వారు చేస్తున్న కృషి కీలకమైనదన్నారు. సమాజమును ఆరోగ్యంగా ఉంచడంలో వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంలో కంకణం కట్టుకుని ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ మున్సిపాలిటిగా శ్రీకాళహస్తి

**-మూడు అవార్డులు, ఉత్తమ పార్కుగా ఎన్‌టిఆర్ పార్కు - నిరంతరం పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు వుండాలి : కమీషనర్**



పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న కలెక్టర్ తదితరలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 2 ప్రభాత వార్త: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మున్సిపాలిటికి ఉత్తమ అవార్డు లభించింది. అలాగే ఉత్తమ పార్కుగా పానగల్ లోని ఎన్‌టిఆర్ పార్కు ఎంపికైంది. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి వారి సహచరులు హాజరై అవార్డులను అందుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అవార్డులను అందించారు.గాంధీ జయంతి సందర్భంగా తిరుపతిలోని కచ్చాపి ఆడిటోరియంలో జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో స్వచ్ఛతకు విశేష కృషి చేసిన మున్సిపాలిటీలు, పార్కులు,పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ అవార్డులలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం మూడు విభాగాల్లో అవార్డులను అందేరొపి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. బెస్ట్ స్వచ్ఛ మున్సిపాలిటీగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఎంపికైంది. అలాగే పట్టణంలోని ఎన్టీఆర్ పార్క్ బెస్ట్ స్వచ్ఛ గ్రీన్ పార్క్ అవార్డును దక్కించుకుంది. మున్సిపాలిటీ పరిధిలో అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి బెస్ట్ స్వచ్ఛ వారియర్ విభాగంలో కూడా శ్రీకాళహస్తికి అవార్డు దక్కించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూడు విభాగాల్లో అవార్డులు రావడం ఎంతో సంతోషంగాను గర్వంగా ఉందని అన్నారు. గత కొన్ని నెలలుగా పట్టణంలో పరిశుభ్రతే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు అవేర్‌నెస్ క్యాంపెయిన్లు, విద్యార్థులతో స్వచ్ఛత ర్యాలీలు, వీధి వీధిలో చెత్త సేకరణ, పార్కుల అభివృద్ధి, ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం వంటి కార్యక్రమాలు నిరంతరం చేపట్టడం వల్లే ఈ ఫలితం దక్కిందన్నారు. ఈ విజయం వెనుక రేయింబవళ్లు కష్టపడిన పారిశుధ్య సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి శ్రీకాళహస్తి పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా నిలపాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్‌లో కూడా శ్రీకాళహస్తి మరిన్ని అవార్డులు సాధించేలా కృషి చేస్తామని కమిషనర్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ లాంఛనాలతో...
# శ్రీ కల్కి భగవాన్ మహాసమాధి

**- లక్షలాది మంది భక్తుల అశ్రునివాళి - హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు**


శ్రీ కల్కి భగవాన్ పార్థివ దేహానికి మహాసమాధి కార్యక్రమ దృశ్యం

వరదయ్యపాలెం, అక్టోబర్ 2 ప్రభాతవార్త: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఏకం వ్యవస్థాపకులు శ్రీ కల్కి భగవాన్ పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఏకం క్షేత్రం, బత్తలవల్లం వద్ద శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అంతిమయాత్ర జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక మెమో నెంబర్ 01.10.2026 ప్రోటోకాల్ బి /2026 ద్వారా పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలని ఉత్తర్వులు ఇచ్చింది. భగవాన్ ఇక లేరన్న వార్త తెలియగానే దేశం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు ఏకం క్షేత్రానికి తరలివచ్చి చివరిసారి శ్రీకల్కి భగవాన్‌ని దర్శించుకున్నారు. శ్రీ కల్కి భగవాన్ అంతిమ యాత్రకు వరదయ్యపాలెం మండల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై య్యారు. భగవాన్ కుమారుడు శ్రీ కృష్ణాజీకి వచ్చిన ప్రముఖులందరూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.కాగా దర్శించుకున్నారు. శ్రీకల్కి భగవాన్ అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించిన ప్రముఖుల్లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హైకోర్టు జడ్జి లక్ష్మణ్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, శ్రీ సిటీ ఎండి రవి సన్నారెడ్డి, టీడీపీ కోఆర్డినేటర్లు కూరపాటి శంకర్ రెడ్డి, ముకుంద రెడ్డి, వైసీపీ ఇన్చార్జ్ నూతకోటి రాజేష్, స్థానిక నాయకులు యుగంధర్ రెడ్డి, నిర్మల్ రవి రెడ్డి, బొప్పన తిలక్ బాబు, బొప్పన రమేష్, ఖాదర్ భాష, కరుణాకర్ నాయుడు సుధాకర్ నాయుడు, తదితరులు నివాళులు అర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించారు.

# ఆసియా పతకాలతో...తిరుపతి ఆర్చర్ మెరుపు



తిరుపతి విద్యు,అక్టోబర్ 2 ప్రభాతవార్త: తిరుపతికి చెందిన ఆర్చర్ శ్రీగణేష్, మణి రత్నం తిరుమూరు ఆసియా క్రీడల్లో సత్తా చాటారు. 20వ ఆసియా క్రీడలు (ఐచి-నగోయా 2026) లో పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం, వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం సాధించి దేశంతో పాటు తిరుపతికి గుర్తింపు తీసుకొచ్చారు. ఆసియా క్రీడలకు సన్నద్ధమవుతున్న సమయంలో గణేష్‌కు హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ) ప్రెసిషన్ ఆర్చరీ పరికరాలను అందించి శిక్షణకు మద్దతు అందించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సమక్షంలో ఈ పరికరాలను గణేష్‌కు అందజేశారు.రెండు పతకాల సాధనపై హెచ్‌సీసీబీ ఇంటిగ్రేటెడ్ సప్లై చైన్ హెడ్ అవినాష్ కాంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడల వంటి అంతర్జాతీయ వేదికపై స్వర్ణ, కాంస్య పతకాలు సాధించడం గణేష్ పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. గణేష్ ప్రయాణానికి అవసరమైన పరికరాల రూపంలో తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌సీసీబీకి దీర్ఘకాలిక కార్యకలాపాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఆత్మకూరు, తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో సంస్థ తయారీ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన క్రీడాకారుడు అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయాన్ని తమ సంస్థతో పాటు స్థానిక సమాజాలు గర్వంగా జరుపుకుంటున్నాయని తెలిపారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి- స్విమ్స్ డీన్, ఇంచార్జ్ డైరెక్టర్ డా. అలోక్ సచన్**



తిరుపతి హెల్త్, అక్టోబర్ 2 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల నందు ఉదయం 10 గంటలకు గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్విమ్స్ డీన్ మరియు ఇంచార్జ్ డైరెక్టర్ డా. అలోక్ సచన్ మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, గాంధీజీ మనకు అందించిన గొప్ప సందేశం సత్యం, అహింస, ప్రేమ, సేవ, స్వచ్ఛత మానవతా విలువలు. ఇవి ఒక ప్రత్యేక సందర్భానికి మాత్రమే పరిమితమైనవి కావు, మన నిత్య జీవితంలో ఆచరించాల్సిన విలువలు అని అన్నారు. గాంధీజీ దృష్టిలో దేశసేవ అంటే ప్రజాసేవ. ముఖ్యంగా బాధలో ఉన్న మనిషికి అండగా నిలవడం,బలహీనులకు తోడుగా ఉండటం, ప్రతి వ్యక్తిని సమాన గౌరవంతో చూడటం ఆయన చూపిన మార్గం. వైద్య రంగంలో పనిచేసే మనకు ఈ సందేశం మరింత ప్రాధాన్యత కలిగి ఉందని పేర్కొన్నారు. రోగికి వైద్యం అందించడం కేవలం ఒక వృత్తిపరమైన బాధ్యత మాత్రమే కాదని, రోగి పట్ల కరుణ, గౌరవం, సానుభూతితో వ్యవహరించడం కూడా వైద్య సేవలో అంతర్భాగమని ఆయన అన్నారు. గాంధీజీ చూపిన మానవతా మార్గంలో నడుస్తూ సమాజంలోని ప్రతి వర్గానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు స్విమ్స్ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ డాక్టర్ శిల్పా కడియాల, డాక్టర్ శరణ్ బి సింగ్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శర్వాణి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ మాధవి, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వైద్యులు, బోధనా సిబ్బంది, అధికారులు, యంబిబియస్ వైద్య విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొని జాతిపితకు ఘన నివాళులు అర్పించి సందేశాన్ని ఇవ్వడం జరిగింది.

## ఎన్‌సీసీ క్యాడెట్లచే...ఘనంగా గాంధీ జయంతి



**చిట్వేలి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కడప కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్. సూర్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా"స్వచ్ఛతా సే సమృద్ధి అంశంపై స్లోగన్ రైటింగ్, స్వచ్ఛ పర్వ్–హరిత్ పర్వ్ అంశంపై వేస్ట్ టు ఆర్ట్ పోటీలు నిర్వహించారు.మహాత్మా గాంధీ జీవితం, సిద్ధాంతాలు, దేశానికి ఆయన చేసిన సేవలపై ఉపాధ్యాయులు తిరుమల విశ్వనాథం, కళావతి, ప్రవీణ్, రమాదేవి, లత, అనూష ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన సీనియర్, జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు



**చిట్వేలి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం టీడీపీ మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛత, శాంతి, సామాజిక బాధ్యతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలు రెడ్డయ్య నాయుడు, చిట్వేలి గ్రామ పార్టీ అధ్యక్షులు పగడాల వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన కె.కె. చౌదరి



**చిట్వేలి, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శుక్రవారం చేపట్టిన గ్లోబల్ హారి కల్చర్ హబ్–ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకు స్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును స్థానిక వ్యక్తి,ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కె.కె. చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసి పలు అంశాలపై మర్యాదపూర్వకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కె.కె. చౌదరి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి వేళ సేవా స్ఫూర్తి...

**వేదాంతపురంలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు**



**తిరుపతి రూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తిరుపతి రూరల్ వేదాంతపురంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి టిడిపి నాయకులు దాతృత్వాన్ని చాటారు. గ్రామ టిడిపి అధ్యక్షుడు చెరుకుల పరంధాం యాదవ్, చంద్ర ముదిరాజ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి పారిశుద్ధ్య కార్మికునికి సుమారు రూ.3,800 విలువ చేసే బియ్యం, కందిపప్పు, నూనె, డెటాల్ తదితర సామగ్రిని అందజేశారు. గ్రామ శుభ్రత కోసం కష్టపడుతున్న కార్మికుల సేవలు అమూల్యమని, వారి సంక్షేమం పట్ల అందరూ బాధ్యతగా ఉండాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి, , టిడిపి సీనియర్ నాయకులు చంద్ర ముదిరాజ్, టిడిపి ఉపాధ్యక్షుడు శ్యాంబాబు, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీ ప్రసాద్, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

## ఓటేరు లో ఘనంగా గాంధీ జయంతి



**తిరుపతి రూరల్, అక్టోబర్ 2 ప్రభాతవార్త** తిరుపతి రూరల్ మండలం ఓటేరు గ్రామంలో జాతిపిత మహాత్మ గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, గ్రామస్తులు ఘన నివాళులు అర్పించారు. గ్రామంలో సేవా భావాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టారు అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఓటేరు గ్రామ నాయకులు ఎం. సూర్య కిరణ్, షేక్ ఇస్మాయిల్, పద్మనాభ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



**రొంపిచెర్ల, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని రొంపిచెర్ల మండలంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీపై ఉన్న గాంధీజీ చిత్రపటానికి బీసీ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి, పాల ఏకరి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు నారాయణస్వామి, బీసీ రొంపిచెర్ల మండల అధ్యక్షులు రాజేంద్ర నాయుని, విద్యావేత్త డాక్టర్ టి. రఘునాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని ఆశయాలు శాంతియుత సమాజ నిర్మాణానికి నేటికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు రామూర్తి, సుదర్శన్, కృష్ణయ్య, ఫిరోజ్, రెడ్డిభాషా తదితరులు పాల్గొన్నారు.

## అహింసతో దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన...

**మహనీయుడు మహాత్మా గాంధీ**



**తిరుపతి,అక్టోబర్ 2ప్రభాతవార్త:** అహింస అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని తిరుపతి జిల్లా బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, నాయకులు మస్తాన్, దస్తగిరి రెడ్డి,లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, డీఎంకే గణేష్, విజయ భాస్కర్ రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ స్ఫూర్తితో... తిరుపతి స్వచ్ఛత పాటించాలి



**తిరుపతి,అక్టోబర్ 2ప్రభాతవార్త:** తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, గాంధీజీ స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతికి కృషి చేయాలని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ కోరారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. గాంధీజీ పరిశుభ్రత పాటించాలని పిలుపుతో ఆయనే స్వయంగా బాత్ రూమ్‌లను శుభ్రం చేసే వారన్నారు. వారి స్ఫూర్తితో తిరుపతిని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ తిరుపతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.కుమారమ్మ, మహేష్ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, బీజీ కృష్ణ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, మునిశేఖర్ రాయల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 6న మాదిగ విద్యార్థి ప్రతినిధుల సమావేశం



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త** హైదరాబాద్‌లో ఈనెల 6న ఉస్మానియా వర్సిటీలో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ ప్రతినిధుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కిషోర్ మాదిగ పిలుపు నిచ్చారు. శుక్రవారం ద్రవిడ వర్సిటీలో ఆయన విద్యార్థులను కలసి సమావేశం ప్రాధాన్యత వివరించారు. ఈ సమావేశంకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. మాదిగ విద్యార్థుల సమస్యలు, విద్యారంగంలో సవాళ్లపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుప్పం కో ఇన్‌చార్జ్ వెంకటేష్ మాదిగ, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు రాజేష్, విజయ్, శంకర్, వాజిద్, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎస్పీచే కళ్యాణోత్సవం ఏర్పాట్ల పరిశీలన



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** మండలంలోని శ్రీబేటరాయస్వామి కొండ వద్ద శనివారం జరిగే శ్రీవారి కళ్యాణోత్సవంకు సంబంధించి భద్రత ఏర్పాట్లను ఎస్పీ బి.హేమంత్ శుక్రవారం పరిశీలించించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భక్తుల భద్రత వంటి అంశాలపై చర్చించారు. ఆలయ పరిసరాల్లో డ్రోన్, సిసి కెమెరాల నిఘా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు సిఐలు, ఐదుమంది ఎస్సైలు, 65మంది సిబ్బంది, రెండు ప్రత్యేక పోలీసు బృందాలతో భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ జిటి నాయుడు పాల్గొన్నారు.

## గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి : ఆర్డీఓ



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కుప్పం ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీజయంతిని ఆర్డీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి ఆర్డీఓ పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. దేశస్వాతంత్ర్యం కోసం అహింసామార్గంలో పయనించి ఆంగ్లేయులనుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చేలా కృషి చేసిన మహనీయుడు గాంధీజీ అన్నారు. కార్యక్రమంలో చలపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీజయంతి వేడుకలు



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను కుప్పంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూజలు నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. ద్రవిడ వర్సిటీలో ఉపకులపతి ఆచార్య ఎంసి మల్లయ్య మహాత్ముడి విగ్రహంకు పూజలు చేసి నివాళులు అర్పించారు. కుప్పంలోని గాంధీ విగ్రహంకు స్థానిక నాయకులు పూజలు చేశారు. తెదేపా కార్యాలయంలో సైతం గాంధీ చిత్రపటానికిపూజలు జరిపారు. ఎంఎఫ్‌సి జూనియర్ కాలేజ్ వద్ద గాంధీ విగ్రహంకు పలువురు నివాళులు అర్పించారు.

***శాంతిపురం :*** మండలంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలకు పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. మహాత్ముడి గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## వైకాపాను వీడి తెదేపాలోకి చేరికలు

**శాంతిపురం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని కర్లగట్ట పంచాయతీకి చెందిన పదహారు కుటుంబాలు శుక్రవారం తెదేపా నేతలు చంద్ర, గిరిధర్, రుద్రప్ప, మురుగేష్‌ల అధ్వర్యంలో తెదేపాలో చేరారు. తుమ్మిశి గ్రామంలోని రామాలయం వద్ద ఈకార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పంను అభివృద్ధి చేయడంతో పాటు కృష్ణాజలాలు తెచ్చారన్నారు. దీంతో రైతు కుటుంబాలు అయిన తాము తెదేపాలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనార్ధనరెడ్డి, మణి, రాజేం ద్ర, చలపతి, గోపాల్, బసవరాజు, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, గోవిందరాజులు, నాగరాజు, బాలమురుగన్ పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి

**– టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్**



**శాంతిపురం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం తుమ్మిశి రామాలయం వద్ద జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడా రు. గతంలో కుప్పం పనిషె మ్మెంట్ ఏరియాగా ఉండేదన్నారు. నేడు సిఎం చంద్రబాబు ద్వారా ఓ ఆదర్శ నియోజకవర్గంగా మారిందన్నారు. అంతకుముందు మహాత్మాగాంధీకి నివాళులు అరి ్పంచారు. అనంతరం మొరసనపల్లి, కడపల్లి పంచాయతీల్లో సమావేశాలు జరిపారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, గోపాల్, మణి, గిరిధర్, చంద్ర, రాజేంద్ర, బసవరాజు, చలపతి, హరినాథరెడ్డి, పెద్దన్న, సుగుణమ్మ, శ్రీనివాసులు, రామచంద్రనాయుడు, శేఖర్, నాగరాజు, గోవిందరాజులు, మురళి, మంజునాథ్, బాలమురుగన్ పాల్గొన్నారు.

## పెద్దవంక అటవీ ప్రాంతంలో శవం వెలికితీత

**–మృతుడు తమిళనాడు వాసి –గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిన వైనం!**

**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** మండలంలోని పెద్దవంక అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిన మృతదేహాన్ని తహశీల్దార్ రమేష్‌బాబు సమక్షంలో అర్బన్ సిఐ జిటి నాయుడు వెలికితీయించారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. పెద్ద వంక ప్రాంతానికి చెందిన కొందరు గొర్రెల కాపరులు గొర్రెలు, మేకలు మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గుంత తీసి పూడి ్చనట్లు ఉండడం, రక్తం పడి ఉండడాన్ని గుర్తించిన వారు కుప్పం అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ అధికారులు కుప్పం పోలీసు అధికారులకు ఈ విషయంగా ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం సంఘటనా స్థలికి చేరుకున్న సిఐ జిటినాయుడు తహశీల్దార్ రమేష్‌బాబు సాయంతో గు ంతను తవ్వించి చూడగా మృతదేహం బయటపడింది. మృతుడి వద్ద ఉన్న ఆధారాలతో అతను తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు సమీపంలోని కరంబూరుకు చెందిన శశికుమార్ (42)గా గుర్తించారు. దీంతో అతని కుటుంబీకులు, తిరుపత్తూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా గతనెల 29వతేది శశికుమార్, అతని భార్య లక్ష్మి తిరుపత్తూరులోని బ్యాంకులో పని ఉందని ఇంటినుంచి బయటకు వచ్చారని అయితే భార్య ఇంతవరకు ఇల్లు చేరలేదని బంధువులు పోలీసులతో పేర్కొన్నారు. శశికుమార్‌ను అతని భార్యే అక్రమసంబంధం కారణంగా హతమార్చి ఉంటుందని పోలీసుల ఎదుట బంధువులు అనుమానాలు వ్యక్తం చేశారని సమాచారం. మృతదేహాన్ని పంచనామాకు తరలించి అర్బన్ సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాయిమాతా సేవా ట్రస్ట్‌కు స్వచ్ఛాంధ్ర పురస్కారం

**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం గాంధీజయంతిని పురస్కరించుకుని ప్రకటించిన స్వ చ్ఛాంధ్ర పురస్కారాన్ని కుప్పం సాయి మాతా సేవా ట్రస్ట్ వ్యవ స్థాప కులు డిఎన్ జగదీష్‌బాబు అందుకు న్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా సంస్థగా సాయిమాతా సేవా ట్రస్ట్ ఎంపికకావడంతో ఆయన ఎంపి దగ్గు మళ్ల ప్రసాద్‌రావు, చిత్తూరు ఎమ్మె ల్యే గురజాల జగన్మోహన్ చేతుల మీదుగా జగదీష్‌బాబు పురస్కారాన్ని అందుకున్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,**

## కాణిపాకంలో అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీ

**–దర్శనానికి నాలుగైదు గంటలు**



**కాణిపాకం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపా కం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ దర్శనార్థం అంచనాలకు మించి అనూహ్యంగా తరలివస్తున్న భక్తులతో శుక్రవారం కాణిపాకం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధార ణంగా ఆలయంలో శని,ఆదివారాలు, వారాంతపు సెలవు రోజుల్లో తీవ్రస్థాయిలో రద్దీవుంటుంది. ఈమేరకు శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్నీ భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు.అలాగే ఆలయ మాడా వీధులు, పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలాలన్నీ కిటకిటలాడాయి.పార్కింగ్ స్థలాలు నిండిపోవడంతో కాణిపాకం పరిసర గ్రామాల వద్ద పార్కింగ్ చేసుకోవాల్సి వచ్చింది.శుక్రవారం ఉదయం నుండి సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారుల అంచనా.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**కాణిపాకం,అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను శుక్రవారం కాణిపాకం దేవస్థానం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు ఆధ్వర్యంలో ఉదయం మహాత్మాగాంధీ చిత్రపటాన్ని వుంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకా ర్యక్రమం లో ఏఈఓలు ఎస్వీ, కృష్ణా రెడ్డి, ప్రసాద్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, సీఏఓ నాగేశ్వరరావు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి పట్టువస్త్రాల సమర్పణ



**కాణిపాకం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉత్సవ ఉభయదారులైన నాయీ బ్రాహ్మణ వంశస్థులచే స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పిం చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవా రం స్వామివారికి కామధేను వాహ నసేవను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఉత్సవ ఉభయదారులైన నాయీ బ్రాహ్మణ వంశస్థులు ఉదయం స్థానిక దేవస్థానం కళ్యాణకట్ట వద్ద నుండి ఊరేగింపుగా మంగళవాయిద్యాల నడుమ నూతన పట్టు వస్త్రాలను తీసుకువచ్చి ఆలయంలో అందజేశారు. ఈనూతన పట్టు వస్త్రాలను ఆలయంలో స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సునీత, సుబ్బారెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, స్థానిక నాయకులు, ఉత్సవ ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిటిడిచే శ్రీవారి కళ్యాణోత్సవం

**– టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం – ముస్తాబైన శ్రీబేటరాయస్వామి కొండ**



**కుప్పం, అక్టోబర్ 2ప్రభాతవార్త:** మండలంలోని శ్రీ బేటరాయస్వామి కొండ ప్రాంతం శ్రీనివాస కళ్యాణోత్సవంకు ముస్తాబైంది. ఏటా పెరటాసి మాసం మూడో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధ్వర్యంలో బేటరాయస్వామి కొండ ప్రాంతంలో శ్రీవారి కళ్యాణోత్స వంను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం 9గంటలనుంచి శ్రీవారి కళ్యాణోత్సవంను నిర్వహించనున్నారు. కళ్యాణోత్సవంకు హాజరయ్యే భక్తులకు భారీ ఎత్తున నిర్వాహకులు అన్నదానం జరుపుతారు. దీంతోపాటు భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పూర్తి చేశారు. కుప్పం ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేక బస్సులు సైతం బేటరాయస్వామి కొండ వరకు తిరుగుతాయి. శుక్రవారం టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం బేటరాయస్వామి కొండ ప్రాంతంలో ఏర్పాట్లను పరి శీలించారు. శనివారం నాటి కళ్యాణోత్సవంకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## మహాత్ముడి జీవితం అందరికీ ఆదర్శప్రాయం : కడ పి.డి.



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా కడ కార్యాలయం వద్ద మహాత్ముడి చిత్రపటానికి పి.డి. పూజలు నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్ముడు చూపిన సత్యం, అహింస, సేవాభావం, స్వచ్ఛత వంటి విలువలు ఎంతో కీలకమైందన్నారు. కుప్పం ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం అంశాల్లో చేపడుతున్న కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, కడ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మదనపల్లికి తరలిన తెలుగు తమ్ముళ్లు



**కుప్పం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శుక్రవారం జరిగిన బహిరంగసభకు కుప్పం నుంచి భారీ సంఖ్యలో ముఖ్య నేతలు, కార్యకర్తలు, రైతులు, అధికారులు తరలివెళ్లారు. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు హాజరయ్యారు. కుప్పం నుంచి 24బస్సులు, ఇరవై కార్లు, ఇతర వాహనాల్లో భారీగా మదనపల్లికి వెళ్లారు. బస్సులను ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఎడి పల్లవి, ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్, హెచ్ఓ డింపుప్రియ, రైతులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతికి వైన్ షాపులు బంద్...

**బి.ఆర్.అంబేద్కర్ జయంతి రోజు కూడా చేయాలి**

**పూతలపట్టు, అక్టోబర్ 2 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కూడా మద్యం దుకాణాలను మూసివేయాలనే డిమాండ్‌పై ప్రజల్లో చర్చ జరుగుతోంది. గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలను నిలిపివేస్తున్నప్పుడు, అంబేద్కర్ జయంతి రోజున అదే విధానం ఎందుకు అమలు చేయడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే మద్యం దుకాణాల మూసివేత అనేది సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ఎక్సైజ్ నిబంధనల ఆధారంగా అమలవుతుంది. కాబట్టి గాంధీ జయంతి, అంబేద్కర్ జయంతి వంటి ముఖ్యమైన రోజుల్లో మద్యం విక్రయాలపై ప్రభుత్వం ఏ నిబంధనలు అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన

# తిరుపతి డివిజన్

# నగరి వీధిలో గాంధీ జయంతి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:

జాతిపిత మహాత్మా గాంధీవ జయంతిని భారత రెండవ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని శ్రీకాళహస్తి నగరి వీధిలోని గోపికృష్ణ టెక్స్టైల్స్ వద్ద మహాత్మా గాంధీ ఫ్రెండ్స్ అసోసియేషన్ చే మహాత్మా గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు విశేష పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది దాదాపు 800 మంది అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వి.రమేష్ బాబు, జి.రమేష్ బాబు, ఎం ప్రసాద్, డి. కుమార్, వయ్యాల సుధాకర్‌రెడ్డి , టి.రమణ, బి.మురళీకృష్ణ,వయ్యాల ఆనంద్ రెడ్డి, జి భాస్కర్ రెడ్డి, ఎస్ గోవిందు,ఎం. చంగల రాయలు,ఓ మధు, ఏం.కార్తీక్, బి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

**సబ్ జైలులో:** మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సబ్‌జైలు ప్రాంగణంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, శ్రీరామ్, అరుణ్, ప్రజ్ఞశ్రీ, జైలు సూపరింటెండెంట్, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌విపి ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో:** సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్రం తెచ్చిన యుగపురుషుడు మహాత్మా గాంధీ అని, అలాగే భారతదేశ రెండవ ప్రధానమంత్రిగా పనిచేసిన లాల్ బహుదూర్ శాస్త్రి నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, నిరాడంబరతలకు ప్రతీక అని ఆర్.బి.వాణిశ్రీ అన్నారు.మనదేశ రెండవ ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు, టి. గంగారాం, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. సునీత, టి. సుధీర్, ఎన్ సి సి అధికారి భాస్కర్ సి. బాపనయ్య, శ్రీ టి. నరసింహులు, పి.వేణుగోపాల్, పి. గాయత్రి, రమేష్ బాబు, కందేరి శ్రీదేవి, శ్రీమతి ఎస్. పద్మావతి, పి.వరలక్ష్మి, పరంధా మయ్య, జి. హన్న తదితర అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో:** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని తేరు వీధిలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్,స్కౌట్ మాస్టర్ ఎస్.కె. అజారుద్దీన్, పద్మావతి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు... నైనారుకండ్రిగ ఎంపిక

నారాయణవనం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :



ప్రతి ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేసే స్వచ్ఛ ఆంధ్ర జిల్లా అవార్డుకు నారాయణవనం మండలం నైనారుకండ్రిగ పంచాయతీ ఎంపికైనది. ఈ సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారి, డిప్యూటీ ఎంపిడిఓ జి రవికుమార్ మాట్లాడుతూ చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నుంచి పూర్తిగా సంపదను తయారీ చేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా వుంచడంతో పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, గ్రీన్ అంబాసిడర్స్, ప్రజల సహకారంతోనే జిల్లా స్థాయి అవార్డు వచ్చిందని కొనియాడారు.

శ్రీ

## ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

నారాయణవనం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :



ప్రజల సహకారంతోనే గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చవని మాజీ సర్పంచులు కె.సుధాబాబు, డి.ఆరుముగంలు తెలిపారు. శుక్రవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని ఉపాధిహామి పథకం కార్మికులు, గ్రామస్తులతో భీమునిచెరువు సచివాలయంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యంగా తాగునీరు, మురికికాలువ, విద్యుత్ లైట్లతో పాటు మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్న చెప్పారు. గ్రామసభ ద్వారా గ్రామంలో వచ్చే ఏడాదిలో జరిగే అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శి సుకుమార్ తెలిపారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్స్‌ను సత్కరించి దుస్తులు అందజేశారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కసరత్తు

పాకాల,అక్టోబరు 2 ప్రభాతవార్త:



స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పాకాల మండలంలోని పేరసానిపల్లి, పదిపుట్లబైలు, ఇ.పాలగుట్టపల్లి, రమణయ్యగారి పల్లి, మొగరాల, పెద్దరామాపురం, కొత్తవడ్డిపల్లి, ఉప్పరపల్లి పంచాయతీల్లో ఆయన పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. రిజర్వేషన్లకు అనుగుణంగా ముందుగానే బలమైన అభ్యర్థులను గుర్తించి అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లొంగకుండా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. గుర్తింపు కార్డు కలిగిన కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపారు.మండల పార్టీ నాయకులు, ఆయా పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు...పార్టీ శ్రేణులు సమాయత్తం:హర్షిత్‌రెడ్డి

చిన్నగొట్టిగల్లు ,అక్టోబరు 2 ప్రభాతవార్త:



ప్రభాతవార్త :స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమాయత్తం కావాలని ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని చిట్టేచర్ల, దీన్ దార్ల పల్లి, భాకరాపేట గ్రామ పంచాయతీల్లో పర్యటించిన ఆయన పార్టీ నేతలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఆయా పంచాయతీల్లో పార్టీ నాయకులు హర్షిత్ రెడ్డి చేతుల మీదుగా గుర్తింపు కార్డులు స్వీకరించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ యుగంధర్ రెడ్డి, మాజీ డీసీఎంస్ చైర్మన్ సహదేవరెడ్డి, వైస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు

## మానవ తప్పిదాలే నేడు వర్షాభావం : రేహాన్

శ్రీకాళహస్తి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:



నేడు సమాజంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వర్షాభావం. దీనికి మూలమేమిటో తెలుసుకోకుండా వ్యవహరిస్తున్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ ఆవేదన వ్యక్తం చేసారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన బోధిస్తూ మనకు శుభాలు కల్గించాలన్నా, శిక్షించాలన్నా అల్లాహ్ నిర్ణయమే అన్నారు. మనం ఇక్కడ జన్మించింది. శాశ్వతంగా ఉండటానికి కాదు.మనకు జన్మనిచ్చిన అల్లాహ్ శాశ్వత సుఖాల కోసం భూమిపై పుట్టించాడనే సత్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఈ జన్మంలో మనం చేసుకునే పుణ్యఫలాలలు మనకు పరలోకంలో శాశ్వత సుఖాలను అందిస్తుందన్నారు. ఎన్నడూ లేని విధంగా నేడు మనం వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాము. అయితే దీనికి పరిష్కారం ప్రకృతి మీద నిందలు వేయటం కాదు. మనకు కష్టాలు వచ్చినపుడు అల్లాహ్ వద్ద శరణుజొచ్చాలి తప్ప పరనిందలతో కాలం గడపరాదన్నారు.మనం ప్రతి నిత్యం ఆరాధించే అల్లాహ్‌ను కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వరుణుని కరుణ కోసం ఆరాధించాలని పిలుపునిచ్చారు. నేడు ఆకాలానికి కారణం మానవ తప్పిదాలే అని గుర్తించుకొని అల్లాహ్ వద్ద వర్షం కోసం వేడుకోవాలని రేహాన్ సూచించారు.

## నాగబాబుకు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 2 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తికి చెందిన దేవస్థానం బోర్డు చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ శుక్రవారం ఎంఎల్‌సి నాగబాబును కలసి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరుని కండువాతో సత్కరించారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన ఆయనను కలసి శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. చైర్మెన్‌తో పాటు రిటైర్డ్ తహశీల్దార్ చంద్రశేఖర్, జయప్రకాష్, కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, పర్వతాల హరి, ఢిల్లిబాబు, గిరి, గణేష్,హరి రఘు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

-గాంధీజయంతి రోజున గ్రామసభలు- ఐతేపల్లి స్పెసలాఫీసర్ భాస్కర్‌బాబు



చంద్రగిరి, అక్టోబర్ 2 ప్రభాతవార్త: ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకోవడమే ప్రత్యేక గ్రామసభ ముఖ్య ఉద్దేశ్యమని మండల విద్యాశాఖాధికారి-2, ఐతేపల్లి ప్రత్యేక అధికారి భాస్కర్ బాబు అన్నారు. గాంధీ జయంతిని పురస్క రించుకుని శుక్రవారం మహాత్ముడి చిత్రపటం వద్ద ముందుగా నివాళు లులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అనగా స్వయం సమృద్ధి, భాగస్వామ్య పాలన లక్ష్యంగా ప్రతి ఏటా అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం విశిష్టతతో కూడుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వచ్ఛ భారత్, పారిశుధ్యంపై ప్రతిజ్ఞ, ప్రభుత్వ పథకాలపై, అట్టడుగు వర్గాలకు సైతం భాగస్వామ్యం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలను సమీక్షించి, లక్ష్యాల సాధనకు తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఐతేపల్లి స్వర్ణగ్రామ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఐదు దివ్య గుణాలను ఆచారించాలి



పుత్తూరురూరల్, అక్టోబరు 2 ప్రభాతవార్త:

గాంధీ జయంతి పురస్కరించుకుని గీతాచార్య యడ్లపల్లి మోహనరావు సత్యం, అహింస, సమానత్వం, పరిశుభ్రత, సేవ అనే ఐదు దివ్య గుణాలపై ఆధ్యాత్మిక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త జీవుల్లోఒకే ఈశ్వర చైతన్యం ఉందని గుర్తించినప్పుడుప్రేమ, కరుణ, అహింస సహజంగా అలవడతాయని తెలిపారు. మనస్సుతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మనుషులు, పక్షులు, జంతువులు, ప్రకృతి పట్ల సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. గాంధీజీకి నిజమైన నివాళి ఆయన ఆశయాలను జీవితంలో ఆచరించడమేనని పేర్కొన్నారు. ఈ ఐదు దివ్య గుణాలను పాటించడం ద్వారా మానవత్వం వికసించి, మనిషి దైవత్వం వైపు పయనిస్తాడని మోహనరావు సందేశమిచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ నిర్వాహకులు సుజాత, పురుషోత్తంశెట్టి, కో-ఆర్డినేటర్లు నాగరాజు, జ్ఞానానంద పాల్గొన్నారు.

## వామపక్షాల పార్టీలు నిరసన




పుత్తూరురూరల్, అక్టోబరు 2 ప్రభాతవార్త:

బీజేపీకి అనుకూలంగా ఓటు చోరీకి పాల్పడిన చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌ని తక్షణమే బర్తరఫ్ చేయాలని పుత్తూరు పట్టణంలో వామపక్షాల పార్టీలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం ఉండేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఓట్ల చోరీకి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నచీఫ్ ఎలెక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ని తక్షనమే పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్‌ను తొలగించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు మహేష్, వెంకటేష్, రవి, సర్వన, గోవిందు, కృష్ణమూర్తి, సుధాకర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు రూరల్ ఎసఎంసి కమిటీలు



పుత్తూరురూరల్, అక్టోబరు 2 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం జడ్పీ హైస్కూలులో నూతనంగా ఎన్నికైన స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, పుత్తూరు మాజీ ఎంపీపీ గంజిమాధవయ్య వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూలు ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం.మణికంఠ, వైస్‌చైర్మన్ ఎం.కె.రేఖ, పుత్తూరు రూరల్, మండల పార్టీ అధ్యక్షుడు ఆరవ బాలాజీ, తడుకు సింగిల్‌విండో చైర్మన్ కరుణ, మాజీ సర్పంచ్ జయకర్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, మునిరత్నం, బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి వేళ పచ్చదనానికి శ్రీకారం

చిన్నగొట్టిగల్లు,అక్టోబరు 2 ప్రభాతవార్త:



జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిద్దయ్య, హెచ్‌ఓ ఆసియ, కూటమి నాయకులు శివకుమార్, మోహన్ రెడ్డి, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక సంఘంచే గాంధీ జయంతి

నారాయణవనం, అక్టోబర్ 2 ప్రభాతవార్త :



జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలను శుక్రవారం మండ లకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీ ఎగువ పద్మశాలీవీధి గాంధీ మండపం వీధిలో ఘనంగా జరుపుకున్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల పద్మశాలీ సంఘం అధ్యక్షులు, సీనియర్ టిడిపి నాయకులు సందాల జయ పెరుమాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి టెంకాయహారతులు పట్టి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చొప్ప మునిబాబు, సి మునస్వామి, బత్తల వేంకటేశం, పైడితలుపుల బాబు, పాతపల్లి నాధముని, సాధు మునికృష్ణయ్య, బండారం కేశవులు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026

జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం



తిరుపతి,అక్టోబర్ 2ప్రభాతవార్త: స్వచ్ఛత, సుస్థిర వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2026 - జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం తిరుపతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్‌తో బ్రాటు పలువురు ప్రభుత్వ అధికారులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు పర్యావరణ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.స్వర్ణాంధ్ర అవార్డ్స్ 2026లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ మరియు వినూత్న పరిష్కారాల కోసం కృషి చేస్తున్న సంస్థలను సత్కరించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంకు చెందిన డాక్టర్ ఎన్. రమా జ్యోతిని పర్యావరణ అవగాహన, సుస్థిరత బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడంలో చేసిన కృషికి గుర్తింపుగా సత్కరించారు. అవార్డు గ్రహీతల కృషిని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు అభినందించారు. స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో స్టార్టప్ సంస్థలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ విభాగాలు మరియు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ విజయాన్ని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సిఈఓ డాక్టర్ జె. సూర్యకుమార్ అభినందించారు.

## వడమాలపేటకు పలు స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్

వడమాలపేట, అక్టోబరు 2 ప్రభాతవార్త:



వడమాలపేట మండలంలోని పలు విభాగాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ వరించాయి. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి లయం స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక కాగా సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్‌లు కలెక్టర్ వెంకటేశ్వరులు నుంచి అవార్డు అందుకున్నారు. వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వచ్చిన అవార్డును డాక్టర్ సందీప్ అందుకున్నారు. శ్రీ బొమ్మరాజపురం పంచాయతీ స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక కాగా బాలకృష్ణ గ్రీన్ అంబాసిడర్, బెస్ట్ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు వచ్చింది. అలాగే ఓబీఆర్ కండ్రిగ హరిజనవాడ అంగన్‌వాడీ టీచర్ పి.కృష్ణవేణికి కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిని ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ జరీనా తదితరులు అభినందించారు.

## ఎస్ఐఆర్‌పై రేణిగుంటలో నిరసన ర్యాలీ

రేణిగుంట, అక్టోబరు 2 ప్రభాతవార్త:



ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేణిగుంటలో వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది.ఈ సందర్భంగా సీపీఎం నేత కొండ్రెడ్డి హరినాథ్, సీపీఐ నేత వై.ఎస్.మణి, కాంగ్రెస్ అధ్యక్షుడు రావణ, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియతో అర్హులైన ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నగేష్, మాజీ వార్డు సభ్యుడు ఎం.జి.రాజేష్, ఐద్వా, ఏఐటీయూసీ, సీఐటీయూ, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలు నేటి భారతానికి మార్గదర్శకాలు

రేణిగుంట, అక్టోబర్ 2 ప్రభాతవార్త:



మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని రేణిగుంటలో గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పించారు. రేణిగుంట బస్టాండ్ కూడలిలోని గాంధీజీ విగ్రహంతో పాటు రైల్వే స్టేషన్ వద్ద కస్తూరిబా సమేత గాంధీజీ విగ్రహాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డి. జూలియన్ రాజు బస్టాండ్ కూడలిలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అహింసను శక్తివంతమైన పోరాట సాధనంగా మలిచిన దూరదృష్టి గల నాయకుడు గాంధీజీ అని అన్నారు. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలను శాంతియుతంగా సంఘటితం చేసిన గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి, భారతదేశానికి మార్గదర్శకాలని జూలియన్ రాజు పేర్కొన్నారు.

## టైక్వాండోలో సత్తా చాటిన రెయిన్బో విద్యార్థులు

రేణిగుంట, అక్టోబరు 2, ప్రభాతవార్త:




టైక్వాండో పోటీల్లో రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల క్రీడా సమాఖ్య టైక్వాండో టోర్నమెంట్‌లో వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.బాలుర విభాగంలో కనిష్క బంగారు పతకం సాధించగా, సాయి ధర్మతేజ్, జ్ఞానేశ్వర్, మస్తాన్, ఇస్మాయిల్ రజత పతకాలు సాధించారు. గీతమ్, జ్ఞాన స్వరూప్, హుస్సేన్, నిహాస్ కాంస్య పతకాలు అందుకున్నారు. బాలికల విభాగంలో క్యాథరిన్, చాంచల్ చౌహాన్, అలియా హబీబా బంగారు పతకాలు సాధించగా, జ్వాల, జాహ్నవి రజత పతకాలు, ఆఫియా, షబ్ను కాంస్య పతకాలు సాధించారు. 19 ఏళ్లలోపు విభాగంలో షబ్నమ్, ప్రదీప్ బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ పి.ఎ. ఖాన్, ప్రిన్సిపాల్ షహేర్ బాను అభినందనలు తెలిపారు.విద్యార్థులకు శిక్షణ అందించిన తైక్వాండో కోచ్ లోకేష్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

## జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన యస్. సాదిక్

రేణిగుంట, అక్టోబరు 2 ప్రభాతవార్త:



జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థి యస్. సాదిక్ అండర్-27 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో విద్యార్థులు స్వర్ణ, రజత పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని యాజమాన్యం పేర్కొంది. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనేలా నిరంతరం ప్రోత్సహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ గౌతమీ, చైర్మన్ మురళీకృష్ణ, హెడ్‌మాస్టర్ సుబ్రమణ్యం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాదిక్‌ను అభినందిస్తూ, అతడి విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బూరగమాను కండ్రిగలో...గాంధీ జయంతి

శ్రీకాళహస్తి రూరల్ అక్టోబర్ 2 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగ గ్రామంలో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఆయన జయంతిని పురస్కరించుకొని చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలాజీ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ముఖేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండ ఈఓను సస్పెండ్ చేసి...



తిరుపతి హెల్త్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:

బోయకొండ గంగమ్మ దేవస్థానంలో టెండర్ల ప్రక్రియలో టెండర్ వేయడానికి వెళ్లిన ఓ. వెంకటరెడ్డి యాదవ్ ఈవో లీవ్‌లో ఉంటే సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించాడని, అక్కడ నుండి

### రీ టెండర్లకు పిలవాలి
### – టెండర్ల దారుడిపై దాడికి ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ జరపాలి

టిడిపి ముసుగులో కొంత మంది రౌడీ మూకలకు సమాచారం ఇవ్వడంతో తనపై దాడి చేశారని వెంకట్ రెడ్డి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు వెళ్లిన బీసీ యువకుడు పై జరిగిన దాడి ఘటనను బీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత టెండర్ ప్రక్రియపై విచారణ జరిపి, వాటిని రద్దు చేసి,రీ టెండర్ కు పిలవాలని ప్రభుత్వాన్ని, దేవదాయ శాఖ మంత్రిని డిమాండ్ చేశారు. బోయకొండ గంగమ్మ దేవస్థానంలో జరిగిన పరిణామాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బీసీ నాయకులు సమావేశమై చర్చించి చలో బోయకొండ కార్యక్రమానికి బీసీ నాయకులు పిలుపునిస్తామన్నారు. నిరంతరం ప్రజలలో ఉండే వెంకట్ రెడ్డి యాదవ్‌పై దాడిని ఖండిస్తున్నామని, తనకు న్యాయం జరగకపోతే మా వాదనను హైకోర్టు వరకు తీసుకెళ్లి అక్కడ వినిపిస్తామన్నారు. ఈ సమావేశంలో సురేష్ యాదవ్, విజయ్ ఉత్తరాది, విక్రమ్ యాదవ్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## నష్ట పరిహారంలో అన్యాయం!

తిరుపతి హెల్త్, అక్టోబర్ 2 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, శ్రీనివాసపురం గ్రామానికి చెందిన 18 ఇండ్ల కుటుంబ బాధితులు రేణిగుంట కడప హైవే రోడ్డు వెడల్పులో భాగంగా తమ ఇండ్లను కోల్పోతున్నామని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గ్రామానికి చెందిన బాధితులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ సుమారు 40 సంవత్సరాలుగా అక్కడే జీవనం సాగిస్తున్నామని, సర్వే నెం.118లో నివాసం వున్న కుటుంబాలలో ఒకరికి ఇద్దరికి మాత్రమే నష్టపరిహారం అందిందని, మిగిలిన వారికి న్యాయబద్ధమైన నష్టపరిహారం అందలేదని, సర్వే నంబర్ 116లో వున్న ఇండ్ల బాధితులకు సుమారు 40 లక్షల నుండి 70 లక్షల మేర నష్టపరిహారం చెల్లించారని, ఒకరికి ఒకలా మరొకరికి మరోలా నష్టపరిహారం చెల్లించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయమై కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డిని సంప్రదించగా ఇచ్చింది తీసుకొని పొమ్మని, మళ్లీ తన వద్దకు రావద్దని, ఇండ్లను ఖాళీ చేయమని హెచ్చరించాడని శ్రీనివాసపురంకు చెందిన బాధితురాలు చెంచులక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు ప్రతి ఒక్కరూ స్పందించి శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో లక్ష్మీపతి, లక్ష్మీ, చెంచులక్ష్మి, రేణుకమ్మ, ఉషా, శారద, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

నాగలాపురం, అక్టోబరు 2 ప్రభాతవార్త:

నాగలాపురం మండలకేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మగాంధీ జయంతివేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన నిర్వహించి, కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దామోధరన్, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి పార్ధీబన్, మండల ఉపాధ్యక్షుడు రాజవేలు, నరేంద్రన్, బీజేపీ మండల అధ్యక్షుడు అయ్యప్పన్, విజయన్, జనసేన పార్టీ సభ్యుడు మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల నిర్వహణపై ప్రజల్లో చర్చ

### – కొన్ని పంచాయతీల్లో ముందస్తు సమాచారం
### – మరికొన్ని చోట్ల తెలియకుండానే సభలు?

పూతలపట్టు, అక్టోబర్ 2 ప్రభాతవార్త :

మండల పరిధిలో ఇటీవల గ్రామ సభలు నిర్వహించిన నేపథ్యంలో వాటి సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన తీరుపై స్థానికంగా చర్చ జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో గ్రామ సభ నిర్వహణకు సంబంధించి ముందుగానే ప్రజలకు సమాచారం అందించినట్లు తెలుస్తుండగా, మరికొన్ని పంచాయతీల్లో మాత్రం గ్రామ సభ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనే విషయం చాలామంది ప్రజలకు తెలియలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. గ్రామ సభ అనేది గ్రామ ప్రజలు తమ సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ పథకాలు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన వేదిక. అలాంటి సభలకు ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే ముందస్తుగా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ఒకే మండలంలో కొన్ని పంచాయతీల్లో సమాచారం అందడం, మరికొన్ని పంచాయతీల్లో సమాచారం అందకపోవడంపై ప్రజలు అక్కడక్కడ చర్చించుకుంటున్నారు. గ్రామ సభల తేదీ, సమయం, వేదిక తదితర వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేస్తే మరింత మంది పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇకపై గ్రామ సభల నిర్వహణపై ప్రతి పంచాయతీలో ముందస్తు సమాచారం అందించి, ప్రజలందరికీ పాల్గొనే అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మెస్ చార్జీల పెంపుపై బీసీ విద్యార్థుల హర్షం

తిరుపతి విద్య,జూలై 2 ప్రభాతవార్త:




తిరుపతి బాలాజీ సర్కిల్‌లోని పూలే విగ్రహం వద్ద బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం జీఓ 18 విడుదల చేయడంపై ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు (యూఎన్ఆర్) ఆధ్వర్యంలో బీసీ హాస్టల్ విద్యార్థులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీ హాస్టళ్లలో విద్యార్థుల భోజన ఖర్చులకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం జీఓ 18 ద్వారా మెస్ చార్జీల పెంపునకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఈ పెంపు దోహదపడుతుందని పేర్కొంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు గట్టు సురేష్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు శీను, యూనివర్సిటీ ఇన్‌చార్జి ఎజ్రా, ధనుష్, మధు, బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పునరుద్ధరించాలి

నాగలాపురం, అక్టోబరు 2 ప్రభాతవార్త:

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని మహాత్మగాంధీ పేరుతోనే కొనసాగించాలని గాంధీ జయంతి సందర్భంగా నిరసన చేసినట్లు ఏఐకేఎంఎస్(అఖిలభారత రైతు కూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మురుగేషన్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని గాంధీ పేరుతోనే కొనసాగించాలని పనిచేస్తున్న ప్రదేశంలోనే ధర్నా నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు దక్షిణామూర్తి, పళణి, వినోదమ్మ, వసంత, సుగుణ, మల్లీ, కలైవాని, సోమమ్మ, పుష్ప పాల్గొన్నారు.

## బాపూజీకు ఘన నివాళులు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయం నందు గాంధీ జయంతిని పురపాలక సంఘ కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు, దేశ స్వాతంత్రం కోసం గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. అసత్యం, అహింస ఆయుధాలతో అలుపెరుగని పోరాటం చేసి దేశానికి స్వాతంత్రం తెచ్చిన గొప్ప వ్యక్తి గాంధీజి అన్నారు. గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డిఇ రవిశంకర్, రెవెన్యూ ఆఫీసరు ఎం. చంద్రకాంత్, ఏఇ తేజశ్విని, లలిత, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్, జయప్రకాష్, అంతర్గత, బహిర్గత సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు నడుంకడదాం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 2 ప్రభాతవార్త: బాల్య వివాహాల నిర్మూలనకు నడుంకడ దామని వార్డు ఇన్‌చార్జి ఎ. హేమంత్‌కుమార్ పిలుపు నిచ్చారు. సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు హానికరమన్నారు. కార్యక్రమంలో గుర్రప్పశెట్టి, వార్డు అడ్మిన్ కార్యదర్శులు తస్లీమ్, చంద్రమ్మ, రమేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, దిల్షాద్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఆటో ఢీ - డ్రైవర్‌కి గాయాలు

నాగలాపురం, అక్టోబరు 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లానాగలాపురం మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలోని తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు కార్లు, ఒక ఆటో ప్రమాదనాకి గురయ్యాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు... అతివేగంగా వస్తున్న రెండు కార్లను తప్పించబోయే క్రమంలోఆటో డ్రైవర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే ఆటో డ్రైవర్‌ని బయటకుతీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరంపోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంకారణంగా తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికిచేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, వాహనాల్లో ప్రయాణిస్తున్నవారి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై విచారణ చేపడుతున్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలలో...

### నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలి



తిరుపతి హెల్త్, అక్టోబర్ 2 ప్రభాతవార్త: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తిరుపతిలో సుమారు 30 వేల మంది ఓటర్లుగా నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు కలిగి ఉన్నారని టిడిపి, జనసేన, బిజెపిలో నాయి బ్రాహ్మణులకు పంచాయతీలలోను, జడ్పీటీసీలుగాను, ఎంపీటీసీలుగా, సర్పంచులుగా, కార్పొరేటర్లుగా అవకాశం కల్పించాలని గ్రేటర్ తిరుపతి నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంఘం నగర అధ్యక్షులు సహదేవ జయకుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయి బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు, కులవృత్తి పరంగా నిలబడి పనిచేయడం వలన వెరికోస్ వ్యాధి భారీన పడి ఏకాగ్రతతో దృష్టి ఉంచి పనిచేయడం వలన కంటిచూపు మందగించడం తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నాయి బ్రాహ్మణులకు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ తిరుపతి నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామ్ నారాయణ, కోశాధికారి ఉప్పలపాటి శివయ్య, కార్యనిర్వక అధ్యక్షులు కలికిరి ముని ప్రతాప్, సభ్యులు ఎం మోహన్ చరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే...

### స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 2 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని 2012 ఎన్నికల మేనిఫెస్టోలోను 2014 సంవత్సరంలో హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు గౌతమ్ కుమార్ అన్నారు.శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకు నిజంగా బీసీలపై చిత్త శుద్ధి ఉంటే రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉందని ఇప్పటికైనా తాను ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందన్నారు. హైకోర్టు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోలు చల్లవని కొట్టి వేసిందన్నారు. గత జగన్మోహన్ రెడ్డి పాలనలో కోర్టు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించటం వలన వెనుకబడిన వర్గాలు సుమారు 165 పదవులను బీసీలు కోల్పోవడం జరిగిందన్నారు. చంద్రబాబుకి నిజంగా బీసీల మీద ప్రేమ ఉంటే రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్లో పెట్టించి స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్, రిటైర్డ్ జిల్లా జడ్జి పెనుమూరు గురప్ప, బహుజన్ లాయర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ పేరాల జయచంద్ర, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు సురేంద్రబాబు, బహుజన్ స్టూడెంట్ ఫోర్స్ జోనల్ కన్వీనర్ గొల్ల శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఉపాధ్యాయులకు 4న బెస్ట్ టీచర్ అవార్డ్స్

### –500 మంది ఉపాధ్యాయులతో గతేడాది రికార్డు
### –ఈసారి చిగురువాడలో సన్మాన కార్యక్రమం



తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త:

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిది ద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించేందుకు అప్పస్మా ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్ అవార్డ్స్- 2026 కార్యక్రమాన్ని ఈ నెల 4న నిర్వహించనున్నారు. చిగురువాడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరగనుందని అప్పస్మా రాయలసీమ జోన్ అధ్యక్షుడు డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. టి. వెంకటేశ్వర్లు తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళీమోహన్, తుడా చైర్మన్ డా. సి. దివాకర్ రెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎం. సుగుణమ్మ, టీటీడీ బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, అప్పస్మా రాష్ట్ర అధ్యక్షుడు కె. తులసి విష్ణు ప్రసాద్ తదితరులు హాజరుకానున్నారు.విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అప్పస్మా నాయకులు డా.ఎస్. భాస్కర రాజు, డా.టి. రామకృష్ణ రెడ్డి, ఆర్. శ్రీధర్, ఎస్.ఎం. భాష కోరారు.

## గాంధీ బాటలో.. స్వచ్ఛతే లక్ష్యంగా...



### సంస్కృత వర్శిటీ లో జయంతి వేడుకలు

తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త: మహాత్మా గాంధీ చూపిన స్వచ్ఛత బాటను ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తీసుకురావాలని శ్రీ వేంకటేశ్వర వైదిక విశ్వ విద్యాలయం వీసీ ప్రొ. రాణీ సదాశివమూర్తి పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం స్వచ్ఛ భారత్ దివస్‌తో పాటు మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.విశ్వవిద్యాలయ వీసీ ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తితో కలిసి గాంధీ, లాల్ బహదూర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం రాణీ సదాశివమూర్తి మాట్లాడుతూ స్వచ్ఛతను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. దేశం కోసం గాంధీ, లాల్ బహదూర్ చేసిన త్యాగాలు, సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొ. రాధా గోవింద్ త్రిపాఠి, ప్రొక్టర్ ప్రొ. సతీష్ కె.ఎస్., స్వచ్ఛతా హి సేవ నోడల్ అధికారి డా. కనపాల కుమార్, రిజర్వేషన్ సెల్ చైర్‌పర్సన్ ప్రొ. జె.బి. చక్రవర్తి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ వి. సేతురాం, యోగ విభాగాధ్యక్షుడు తపన్ కుమార్ గడై, డా. కె. లీనా చంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి అగ్రనేతలకు ఆరణి స్వాగతం

### –రాయలసీమ అభివృద్ధికి కీలక ప్రాజెక్టుల శంకుస్థాపన

తిరుపతి విద్య,జూలై 2 ప్రభాతవార్త:



రాయలసీమ అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టులకు మదనపల్లె వేదికగా శంకుస్థాపన జరిగిన సందర్భంగా కూటమి అగ్రనేతలకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. శుక్రవారం మదనపల్లెకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానించారు. రాయలసీమ ఉద్యానరంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. అలాగే రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, పంటల అనంతర నిర్వహణ, మార్కెటింగ్ వంటి అంశాల్లో శిక్షణ, సేవలు అందించేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాయలసీమకు పెట్టుబడులు, వ్యవసాయ ఆధారిత మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి తీసుకురావడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

## గాంధీ బాటలో.. న్యాయ విద్యార్థుల అడుగులు



తిరుపతి విద్య,జూలై 2 ప్రభాత వార్త: సత్యం, అహింస, సమా నత్వం వంటి గాంధీజీ విలువలను న్యాయవృత్తిలోనూ ఆచరణలో పెట్టాలని డా. అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డా. ఆర్. తిప్పారెడ్డి సూచించారు. తిరుపతిలోని కళాశాలలో గురువారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి చైర్మన్, ప్రిన్సిపాల్ డా. బిజయ్ కుమార్ బెహరా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. డా. ఆర్. తిప్పారెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు కేవలం చట్టాలను చదవడంతో సరిపెట్టుకోకుండా, రాజ్యాంగ విలువలను జీవితంలోనూ, వృత్తిలోనూ పాటించాలని అన్నారు. ప్రిన్సిపాల్ డా. బిజయ్ కుమార్ బెహరా మాట్లాడుతూ అహింసా మార్గంతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన గాంధీజీ ప్రపంచానికి నైతిక నాయకత్వానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. న్యాయవృత్తిలో నిజాయితీ, నిష్పాక్షికత, వృత్తి నైతికతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం గాంధీజీ జీవితం, స్వాతంత్ర్య పోరాటం, అహింసా సిద్ధాంతంపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగ విలువలు, న్యాయపాలన, మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా. ఆర్. తిప్పారెడ్డి, ప్రిన్సిపాల్ డా. బిజయ్ కుమార్ బెహరా, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాంధీ మార్గంలో.. దేశాభివృద్ధికి అడుగులు

తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త: గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ విలువలను ఆచరణలో



పెట్టాలని, విద్యార్థులు తమ జ్ఞానాన్ని దేశాభివృద్ధికి వినియోగించాలని తిరుపతి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా. మాలకొండయ్య పిలుపునిచ్చారు. కళాశాలలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ జీవితంలో పాటించిన సత్యం, అహింస, క్రమశిక్షణ, సేవా భావం వంటి విలువలు నేటి తరానికి కూడా మార్గదర్శకమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను గుర్తించి, తమ ప్రతిభను ప్రజలకు ఉపయోగపడే విధంగా మలుచుకోవాలని సూచించారు.ముఖ్యంగా పశువైద్య విద్యార్థులు గ్రామీ ణ ప్రాంతాల్లో రైతులు, పశుపోషకులకు సేవలందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు.కార్యక్రమంలో ఓఎస్‌ఏ డా. వరప్రసాద్ రెడ్డి, డా. రాంబాబు నాయక్‌తో పాటు బోధన, బోధనే తర,కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పిం చారు.